# నాటిన మొక్కలను సంరక్షించాలి

## మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి

పెనుబల్లి, జూలై 3 : వన మహోత్సవంలో మొక్కలు నాటడమే కాదు నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించే బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలని రాష్ట్ర అటవీశాఖ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రెవెన్యూ, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే మాట్టా రాగమయితో కలిసి గొల్లగూడెం ప్లానిటేషన్‌లో వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హరితవనాలు ఎంతో అవసరమని, వనాలను పెంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు, అటవీశాఖ అధికారులే కాకుండా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాంగణంలో అడవి ఉత్పత్తుల విత్తనాలు స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి నదీం మొహమ్మద్, సీసీఎఫ్ భీమానాయక్, పీపీ సునీల్‌దత్, టీఎఫ్‌వో విక్రమ్‌సిద్ధార్థ్‌సింగ్, తెలంగాణ విద్య, మౌలిక వసతుల చైర్మన్ మువ్వా విజయబాబు, ఎఫ్‌డీవో మంజుల, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఎఫ్‌ఆర్‌వోలు స్నేహలత, అరవింద్, డీఆర్‌వో ఎంఆర్‌పీ. రావు, రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఆర్డీవో రాజేంద్ర గౌడ్, తహసీల్దార్ గంటా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపాలని మంత్రి పొంగులేటికి వినతి

సత్తుపల్లిటౌన్, జూలై 3 : బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారయణ సత్తుపల్లిలో కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా సత్తుపల్లి పట్టణంతో పాటూ వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండల కేంద్రాలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తడికమల్ల యోగు, లాల్‌మొహమ్మద్, షేక్ రంజాన్‌బీ, బీ.నాగవెంకటేశ్వరరావు, శివనాగమణి, హమీద్, అజయ్ పాల్గొన్నారు.

## అంతరసేద్యంతో కలుపు నివారణ

కారేపల్లి, జూలై 3 : పత్తిలో అంతర సేద్యంతో కలుపు నివారణతోపాటు పంట ఎదుగుదలకు దోహదపడుతుందని ఏవో కే.ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. మండలంలో పత్తి పంట సుమారు 18 వేల ఎకరాలు సాగు చేయడం జరిగిందని, పత్తి 25-30 రోజుల దశలో ఉందని, ఈ దశలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కలుపు నివారణకు క్విజఫాస్ 10 శాతం, పైరి తయోబాక్ సోడియంలను ఎకరాకు 250 మి.లి. లీటర్లు చొప్పున 200 లీటర్ల నీటిలోకలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పంటను తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

## వర్షం కోసం రైతుల ఎదురుచూపు

పెనుబల్లి, జూలై 3 : వర్షాలు ముందుగానే వస్తాయని భావించిన రైతులు వరి పంటలు వేసేందుకు కరివేద సాగుపై ఆసక్తి చూపించారు. కానీ ఇప్పటివరకు ఆశించిన మేర వర్షాలు కురవలేదు. అప్పుడప్పుడు చిరుజల్లులు పడంతో పొలాల్లో వేసిన వరి విత్తనాలు మొలకెత్తాయి. అయితే పైరుకు సరిపడా వానలు కురవలేదు. ఉదయం ఎండలు, సాయంత్రం ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా వరుణ దేవుడు కనికరించాలని కోరుకుంటున్నారు.

## నారు మడుల్లో జాగ్రత్తలు తీసుకోండి

కూసుమంచి, జూలై 3: నారుమడుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోక పోతే నారుకు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి రామడుగు వాణి అన్నారు. మండలంలోని నాయకన్‌గడెంలో బుధవారం రైతుల నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలుపు లేకుండా చూసుకోవాలి, గట్లు సన్నవి చేసుకోవడం వల్ల ఎలుకల బెడద తగ్గుతుందన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఏఈవో నిఖిల పాల్గొన్నారు.

## సాగు అయ్యే భూములకు రైతుభరోసా ఇవ్వాలి

ముదిగొండ, జూలై 3: సాగు అయ్యే ప్రతి ఎకరాకూ రైతుభరోసా ఇవ్వాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం మేడేపల్లిలో జిల్లా సహకారం సంఘం ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం అందరికీ రైతుబంధు ఇచ్చిందని, వివిధ కారణాలతో ఈ ప్రభుత్వం రైతుభరోసా కట్ చేయడం సరికాదని అన్నారు. వరంగల్ సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ నీరజ, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీదేవి, ఏం రాధ, ఏఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక కవి సమ్మేళనంలో రాజుపేట వాసికి సన్మానం

కూసుమంచి, జూలై 3: కూసుమంచి మండలం రాజుపేటకు చెందిన సబ్బు నాగయ్యను సూర్యాపేటలోని శ్రీశ్రీ కళావేదిక 136వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో సన్మానించారు. దలిత సమాజంపై కవితా గానం చేసినందుకు నాగయ్యకు ఈ పురస్కారం దక్కింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కత్తి మండవ ప్రతాప్, కన్వీనర్ రమాదేవి, ఈశ్వరి, భూషణం, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌కు బీఆర్ఎస్ యువజన విభాగం సన్మానం

ఖమ్మం, జూలై 3: కేఎంసీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అభిషేక్ అగస్త్యను బీఆర్ఎస్ యువజన విభాగం నగర కమిటీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేఎంసీ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అతడిని కలిసిన నాయకులు.. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను సన్మానించిన వారిలో యువజన విభాగం నాయకులు ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్‌కుమార్, ఇతర నాయకులు సరిపుడి గోపి, కల్యాణ్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## పార్కుల నిర్వహణలో సమస్యలుంటే చెప్పండి: కమిషనర్

ఖమ్మం, జూలై 3: పార్కుల నిర్వహణలో సమస్యలుంటే సంబంధిత అధికారులు తన దృష్టికి తీసుకురావాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ సూచించారు. ఖమ్మంలో పలు పార్కులను, వివిధ ప్రదేశాలను బుధవారం పరిశీలించిన ఆయన.. వాటి నిర్వహణ, పర్యవేక్షణ వంటి వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత లకారం ట్యాంక్‌బండ్, గోళ్లపాడు చానల్, వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌లను పరిశీలించారు. వాటిని ఏ సమయమానికి తెరుస్తారు? ఏ సమయానికి ముగిస్తారు? అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, వాటిల్లోని వసతుల గురించి ఆరా తీశారు. అలాగే ఆయా పార్కులను కూడా పరిశీలించిన ఆయన.. సందర్శకులను ఏ సమయాల్లో అనుమతిస్తున్నారు? పార్కులను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అనే విషయాల గురించి వాకబు చేశారు.

## 'చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

ఖమ్మం, జూలై 3: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి కోరారు. ఈ మేరకు పద్మశాలీ, చేనేత సహకార సంఘాల నేతలతో వెళ్లి.. హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల సమస్యలను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. అందుకు మంత్రి స్పందిస్తూ.. సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

తిరుమలాయపాలెం, జూలై 3: ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలని ఇంటర్‌మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు అన్నారు. మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలల్లో అడ్మిషన్ల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇంటర్ బోర్డు నూతనంగా తీసుకొస్తున్న ఐ.ఈ యాప్ గురించి తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవిబాబు

## క్లాస్‌లో సెల్‌ఫోన్ వాడితే చర్యలు: డీఈవో

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 3: ఉపాధ్యాయులు తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడితే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఈవో సోమశేఖరశర్మ స్పష్టంచేశారు. నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో ప్రధానోపాధ్యాయులు సహకరించాలని, నూరుశాతం హాజరు ఉండేలా కృషిచేయాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఈ ఏడాది నాలుగుసార్లు నిర్వహించాలని, పీటీఎంలను విధిగా జరపాలని ఆదేశించారు. బేస్‌లైన్ టెస్ట్ పేపర్లు దిద్ది గ్రేడింగ్ చేసి సవరణాత్మక బోధన చేయాలని కోరారు. ఈ నెల 5న కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏఎంవో రవికుమార్, సెక్టోరల్ అధికారులు రామకృష్ణ, పాపారావు, జీఎస్ ప్రసాద్, ఎంఈవో దామోదరప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

కూసుమంచి (నేలకొండపల్లి), జూలై 3: రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలు తీసుకునేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా వ్యవసాశాఖ అధికారి విజయనిర్మల అన్నారు. నేలకొండపల్లి మండలం నాచేపల్లి, పైనంపల్లి, రాజారాంపేట తదితర ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సర్వసభ్య సమావేవాలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాశాఖ అధికారి మాట్లాడుతూ.. రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో నాగుబండి శ్రీనివాసరావు, తన్నీరు సత్యనారాయణ, బాలాజీ, ఏడీఏ విజయ్ చంద్ర, ఏవో అరుణకుమారి, సహకార సంఘం సీఈవోలు సత్యాల కోటయ్య, రామకోటయ్య, జగదీశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఏవో విజయనిర్మల

## 'పద్మశాలీలంతా ఐక్యమత్యంగా ఉండాలి'

ఖమ్మం, జూలై 3: పద్మశాలీలంతా ఐకమత్యంగా ఉండాలని తెలంగాణ పద్మశాలీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి ఆకాంక్షించారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘ బాధ్యులందరూ సంఘం బలోపేతానికి తోడ్పడాలని కోరారు. అనంతరం జల్లా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి ఆహ్వానాన్ని గౌరవించి వారితో కలిసి పనిచేసేందుకు నిర్ణయించుకుని అభ్యుదయ పద్మశాలీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేశానని అన్నారు. పద్మశాలీ సంఘం నాయకులు బొమ్మ రాజేశ్వరరావు, చిలకమర్రి శ్రీనివాస్‌బాబు, తాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఖమ్మం అభివృద్ధిని పరిశీలించిన 'మంథని' అధికారులు

ఖమ్మం, జూలై 3: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఆ జిల్లాలోని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునస్వామితోపాటు పలువురు కౌన్సిలర్లు బుధవారం ఖమ్మంలో పర్యటించారు. ఇక్కడ జరిగిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించార. ముందుగా కేఎంసీ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజను మర్యాదపూర్వకంగా కలిశారు. నగర అభివృద్ధి గురించి చర్చించారు. మంథని కౌన్సిలర్లు గుండా విజయలక్ష్మి, హనుమంతు, అధికారులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో మహిళ ఆందోళన

చింతకాని, జూలై 3: పసుపు కుంకుమ కింద రాసిచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేయగా బాధితులు ఆందోళన చేసిన ఘటన తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం చోటుచేసుకుంది. లచ్చగూడెం గ్రామానికి చెందిన చింతాల వెంకట్రావమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. పందిళ్ళపల్లికి చెందిన తన తల్లి మండే తులిశమ్మ తనకున్న 2ఎకరాల వ్యవసాయ భూమిలో ఇద్దరు కుమార్తెలు వెంకట్రావమ్మ, నాగమణికి పెళ్లి సమయంలో ఇస్తానన్న భూమిని 2020లో ఒక్కొక్కరికీ 10 గుంటల చొప్పున పసుపు కుంకుమ కింద రాసిచ్చింది. తులిశమ్మ కుమారులు హనుమంతరావు, నాగయ్య, చంద్రయ్య, రామారావు 2 ఎకరాల వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఇటీవల స్లాట్ బుక్ చేసుకున్నారు. గత సోమవారం ముగ్గురు కుమారులకు, బుధవారం మరో కుమారునికి రిజిస్ట్రేషన్ చేశారు. విషయం తెలుసుకున్న కుమార్తెలు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ ఘటనపై తహసీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా రైతులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ ఆపడం తన పరిధిలో లేదని తెలిపారు.

## పదోన్నతులు, బదిలీలపై మంత్రులకు వినతి

కారేపల్లి, జూలై 3 : గిరిజన శాఖ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని కోరుతూ బుధవారం టీజీటీడబ్ల్యూ, పీపీటీయూ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కలకు హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు ప్రతాప్ సింగ్‌నాయక్ తెలిపారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నేతృత్వంలో ఉపాధ్యాయులు మంత్రులను కలిసి గిరిజన ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేశారని, ఐటీడీఏలో మాత్రం చేయలేదని మంత్రులకు వివరించారు. హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేయడంతో గిరిజన శాఖ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీజీటీడబ్ల్యూ, పీపీటీయూ ములుగు, ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నాయకులు ప్రభాకర్, రమేష్‌స్వామి, సారయ్య, సతీష్, రవీంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఇంటెలిజెన్స్ సీఐ

సత్తుపల్లిటౌన్, జూలై 3 : సత్తుపల్లిలో వనమహోత్సవం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభ వద్ద జర్నలిస్టులపై ఖమ్మం ఇంటెలిజెన్సీ సీఐ దురుసుగా ప్రవర్తించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వనమహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జలగం వెంగళరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా సిబ్బందిపై సీఐ టీ.రమేశ్ దురుసుగా ప్రవర్తించారు. మంత్రులు ప్రసంగిస్తుండగా ఓ సీనియర్ జర్నలిస్టు ఫొటో తీసేందుకు వెళ్లగా అక్కడే ఉన్న సీఐ రమేశ్ పక్కకు వెళ్లి పోవాలనినెట్టారు. దీంతో జర్నలిస్టు తాను కవరేజ్ చేస్తున్నానని చెప్పగా సీఐ కార్డు చూపించాలంటూ దురుసుగా ప్రవర్తించారు. మంత్రుల సమక్షంలో జరిగిన ఈ ఘటనతో పక్కనే ఉన్న జర్నలిస్టులు కొద్దిసేపు నిరసన చేపట్టారు. దీంతో అక్కడే విధుల్లో ఉన్న సత్తుపల్లి సీఐ కిరణ్ కల్పించుకొని మాట్లాడడంతో వ్యవహారం సద్దుమణిగింది.

## 'ప్లాస్టిక్ వాడకం మానవాళి మనుగడకు ప్రమాదం'

ఖమ్మం/ ఖమ్మం సిటీ, జూన్ 3: ప్లాస్టిక్ వాడకం మానవాళి మనుగడకు అత్యంత ప్రమాదకరమని లయన్స్ క్లబ్ ఖమ్మం అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వాడక నిషేధ దినోత్సవం సందర్భంగా నగరంలోని లకారం ట్యాంక్‌బండ్ దగ్గర ఖమ్మం లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్, ఫిమేల్ యోగ క్లబ్‌లతో కలిసి ప్లాస్టిక్ వినియోగం కారణంగా జరిగే నష్టాల గురించి బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వస్తువులు మట్టిలో కలిసిపోవడానికి వందల ఏళ్ల సమయం పడుతుందని అన్నారు. అనంతరం కాటన్ సంచులను ప్రజలకు ఉచితంగా అందజేశారు. క్లబ్ బాధ్యులు, వైద్యులు గెల్లా శ్రీరామ్, గోవిందరావు, విశ్వేశ్వరరావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీదేవి, శ్రీలతారెడ్డి, ప్రతిమ, డీపీసీ రావు, ఖాదర్‌బాబు, రమేశ్, పుల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు

## డీసీహెచ్ఎస్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ

ఖమ్మం సిటీ, జూలై 3: తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని జిల్లా ఆసుపత్రుల సమన్వయ ఇన్‌చార్జి అధికారి (డీసీహెచ్ఎస్)గా డాక్టర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు ఆదేశాలు, కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఖమ్మం నూతన కలెక్టరేట్‌లోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో డాక్టర్ బీ.వెంకటేశ్వర్లు బుధవారం తన విధుల నుంచి తప్పుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. వైద్య విధాన పరిషత్ పరిధిలోని తమ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. అనంతరం పలువురు వైద్యులు, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## నేటి నుంచి 'ఇంజినీరింగ్' స్లాట్ బుకింగ్

### 6 నుంచి ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్‌లో సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 3: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా గురువారం నుంచి స్లాట్ బుకింగ్‌కు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 6 నుంచి ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్లాట్ బుకింగ్ చేసుకున్న ప్రకారం అధికారులు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. ఈ నెల 12 వరకు స్లాట్ బుకింగ్‌కు, 6 నుంచి 13 వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు షెడ్యూల్ కేటాయించినట్లు ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు టీజీ ఎప్‌సెట్ ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, ఆధార్ కార్డు, ఎస్ఎస్సీ, ఇంటర్ మార్కుల మెమోలు, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఏప్రిల్ 1 తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువపత్రం, స్లాట్ బుకింగ్ ధ్రువపత్రం వంటి సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

## బాధితుడికి ఆర్థికసాయం

కారేపల్లి, జూలై 3 : లారీ ప్రమాదంలో తీవ్రగాయాలై ప్రాణాలతో పోరాడుతున్న బాధితుడు రామగిరి సంపత్‌కు బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు గౌసుద్దీన్ బుధవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సంపత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వ్యక్తిపై కేసు నమోదు

చింతకాని, జూలై 3: మండల పరిధిలో జగన్నాథపురం గ్రామానికి చెందిన పీ శ్రీనుపై చింతకాని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కందా శకుంతల భర్తను, తండ్రిపై అకారణంగా దాడి చేశాడు. దీంతో శకుంతల ఫిర్యాదు మేరకు శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ నాగేల్‌మీరా తెలిపారు.

## యువకుడు మిస్సింగ్‌పై కేసు నమోదు

చింతకాని, జూలై 3: మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన యువకుడు ఎస్‌జీ మున్వర్(27) గత మంగళవారం నుంచి కనిపించడం లేదని చింతకాని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మున్వర్ పెద్దమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

## అనారోగ్యంతో సూపరింటెండెంట్ మృతి

ముదిగొండ, జూలై 3: ముదిగొండ ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పి శ్రీనివాస్ (50) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. శ్రీనివాస్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ కొద్దిరోజుల నుంచి హైదరాబాద్‌లో చికిత్స అందిస్తున్నారు. బుధవారం ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించి తుదిశ్వాస విడిచాడు. శ్రీనివాస్ మృతికి పలువురు ప్రముఖులు, కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మామిళ్లగూడెం, జూలై 3: నగరంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని చెరువుబజార్ ప్రాంతానికి చెందిన దుగ్గిరాల సూర్యనారాయణ గతంలో గంజాయిని పట్టుబడ్డాడు. పోలీసులు అతడిపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో బుధవారం అతడు 3 కేజీల గంజాయిని తీసుకొని మమత ఆసుపత్రి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులు అతడిని మమత రోడ్డులోని అబ్దుల్‌కలాంనగర్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

## రైతు ఆత్మహత్యపై నిజాలు వెలికితీయాలి: బీజేపీ

ఖమ్మం, జూలై 3: చింతకాని మండల రైతు ఆత్మహత్య అత్యంత బాధాకరమని బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. అతడి ఆత్మహత్యపై నిజాలను వెలికితీయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, అతడి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు.

## గంజాయి మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం

మధిర, జూలై 3: మధిర ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మధిర ప్రధాన న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా, చెడు స్నేహాలు జోలికి వెళ్లకుండా మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. చేయూత మత్తు పదార్థాల బానిసల పునరావాస కేంద్రం డైరెక్టర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. చెడు స్నేహాలు చేసి గంజాయికు అలవాటు పడి భవిష్యత్‌ను, ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. సదస్సులో హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు, సీఎల్వీ సుజాత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 'బొగ్గు బ్లాకుల వేలం'పై రేపు లెఫ్ట్ ఆందోళన

కమాన్‌బజార్, జూలై 3: బొగ్గు బ్లాకుల వేలాన్ని నిరసిస్తూ ఈ నెల 5న శుక్రవారం